అలివేలు ముస్తాబై చెప్పులు తొడుక్కుంటోంది.

''పద్మా వాళ్ళింటికి పేరంటా నికా! మొన్ననేగా వాళ్ళ పాపాయి బోర్లాపడిందని బొబ్బట్లు పంచిపెడుతున్నారని వెళ్ళావు?'' అన్నాడు సోమలింగం.

''ఈసారి వాళ్ళాయన స్కూటర్ మీంచీ బోర్లబొక్కలా పడ్డాట్ట. అందుకని అందరికీ హెల్మెట్లు పంచిపెడుతున్నార్ట'' అంది అలివేలు.

# ది హెల్మెట్




అనూరాధ సర్రాజు

సోమలింగం సంతోషించాడు. పద్మావాళ్ళాయన బోర్లాపడ్డందుకు కాదు. జులై ఎనిమిది నుంచీ టూ వీలర్స్ గాళ్ళందరూ హెల్మెట్లు పెట్టుకోవాలని తమిళ నాడు గవర్నమెంటువారి రూలు. ఒక్కో హెల్మెట్టూ మార్కెట్లో రెండొందల పైచిలుకుంది. బుర్రమీద హెల్మెట్టు పెట్టి ఈడ్చి తన్నినా సోమలింగం దగ్గర 20 రూపాయిలు కూడా లేవు.

లేచి గబగబా ప్యాంటు వేసుకుంటున్నాడు.

''బయటకు వెడుతున్నారా! తాళం చెవి నాకివ్వండి. మళ్ళీ ఎప్పుడొస్తారో ఏమో... మీ బామ్మగారు పెత్తనానికి వెళ్ళారు. ఆవిడ వచ్చేలోపలే నేనూ వచ్చేస్తాను'' అంది అలివేలు.

''ఇద్దరం కలిసే వెడుతున్నాము పేరంటానికి'' అన్నాడు సోమలింగం తల దువ్వుకుంటూ. స్కూటర్ తోలేవాడికే కాకుండా తోకలా కూర్చున్నవాడికి కూడా హెల్మెట్టుండాలిట. తనూ పేరంటానికి వెడితే రెండు




హెల్మెట్లు. అంటే నాలుగొందలు పేవు.

"చాల్లాల్లెండి... నవ్విపోతారు" అని విసవిసా వెళ్ళిపోయింది అలివేలు. తర్వాత పేరంటం నుంచి చలి విడితో చేసిన హెల్లెట్టు మోడల్స్ రెండు పట్టుకొచ్చింది- శాస్త్రార్థం.

సోమలింగం, అలివేలులది కొత్త కాపురం. అందుకని సోమలింగం వాళ్ళ బామ్మను కూడా వెంటపెట్టుకొచ్చాడు. ఆవిడని అంటిపెట్టుకునే ఆవిడ వత్తుల పెట్టె కూడా వచ్చింది. సోమలింగం కాలేజీ చదువులు పూర్తయిన కొన్ని రోజులదాకా కూడా ఆ వత్తుల పెట్టే అతనికి చిరుతిళ్ళు కొనిపెట్టింది. చిన్నచిన్న అవసరాలు తీర్చింది . ఆ వత్తుల పెట్టెలోంచి డబ్బులు తీసుకునే, అతని అభిమాన నటి జయసుధ నటించిన సినిమాలకు వెళ్ళేవాడు. ఆ వత్తుల పెట్టె శాపానికేనేమో ఆవిడ డైలాగ్సులో ఒక్క వత్తు కూడా వినపడేది కాదు సోమలింగానికి.

అయినా ఆ బోషాణం లోంచీ ధనం తీసుకోవటం అతని ధర్మంగా భావించేవాడు. దానికీ, అతనికీ వున్న ఋణానుబంధం అలాంటిది.

చాలా కాలానికి మళ్ళీ పని పడింది. వాళ్ళ బామ్మ చుట్టుప్రక్కల లేదని నిశ్చయించుకుని, కళ్ళకు గంతలు కట్టుకుని, పూర్వపు చోరోత్సాహాన్ని మనసులో నింపుకుని, వంటింట్లోకి జొరబడ్డాడు. కాస్సేపు వెతగ్గా అలమారులో మూడో అరలో వెనగ్గా దాక్కుని వుంది భోషాణం. చెయ్యి జాపి తియ్యబోతున్నాడు.

"సినిమాక్కూడా డబ్బులు లేనంత దరిద్రుడివై పోయావురా నాన్నా?" అన్న అప్యాయమైన పలకరింపుతో బెదిరిపోయాడు. వత్తిపెట్టె వదిలేసి, గద్గద కంఠంతో బామ్మ భుజంమీద వాలిపోయి ఇదీ విషయం అని చెప్పేశాడు.

బామ్మ ఆలోచనల్లో పడింది. "నీ మొదటి నెల జీతం, తెచ్చుకున్న డబ్బు, అన్నీ ఇంటి అడ్వాన్సులకీ గ్రటాలకీ అయిపోయాయిగదా! నా కొడుకు (అంటే సోమలింగం తండ్రి) నా ధాన్యం అమ్మిన తాలూకు పదివేలూ పంపిస్తున్నానని రాశాడు. అప్పుడు కొనుక్కోవచ్చుకదా" అంది. ఆయన విషయం సోమలింగానికి తెలీంది కాదు. ఇదుగో అంటే ఆర్నెల్లకు గానీ వెయ్యడు. అంత బద్ధకం. 'పాపం బామ్మ దగ్గిర కూడా డబ్బులు లేవనుకుంటా' అనుకున్నాడు. రేపే చివరిరోజు. స్కూటర్ లేకుండా బయటకు వెళ్ళటం అతని వల్ల కాదు. అసలు నడవడమే ఎప్పుడో మర్చిపోయాడు. ఎప్పుడైనా మరీ అవసరపడి నడిస్తే తప్పటడుగులు వేసినట్లే. ఎవరినీ అప్పడగటం అతనికి అస్సలిష్టం లేదు. పైగా అంత చనువున్న పరిచయస్తులూ లేరు.

దిగాలుగా కూర్చున్నాడు. మెదడు బాగా వేడెక్కింది. నెత్తిమీద ఎవరో ఠంగ్ ఠంగ్‌మని సుత్తి దెబ్బలు కొడుతున్నట్లుంది. కాస్సేపటికి అవి నిజం సుత్తి దెబ్బలే అని గ్రహించాడు. లేచి పెరట్లోకి వెళ్ళాడు.

బక్కెట్లకీ, బిందెలకి మాట్లు వేసేవాడు. నిక్షేపం లాంటి రాగి బాణలిని సుత్తితో కొడుతున్నాడు. బామ్మ ప్రక్కనే కూర్చుని వాడికి ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తోంది. దగ్గిరకెళ్ళగానే వాడు అందించిన దాన్ని చూసి తృప్తిగా తల తాటించి, సోమలింగం నెత్తిమీద అమర్చింది.

"చూసుకో నాన్నా! సైజు సరిపోయిందా? ఇంకొంచెం టైటు చేయించనా!" అంది.

"ఏమిటే ఇది?" అన్నాడు సోమలింగం ఇబ్బందిగా.

"ఇది ఎలాగూ పాతదైపోయింది. పోలీసులు పట్టుకోకుండా నెత్తిమీద ఏదో ఒక బొచ్చె వుంటే చాలని ప్రక్కింటివాళ్ళ అబ్బాయి చెప్పాడు. అందుకని టెంపరవరీగా ఈ ఏర్పాటు చేశాను" అంది. నెత్తిమీద జిడ్డోడుతున్న బాణలిని తీసేసి తలస్నానం చేసి బయట పడ్డాడు.

దగ్గర్లోని గీతాకేఫ్‌లో కాఫీ తాగుతుంటే మూర్తి కనబడ్డాడు. సోమలింగం పన్చేసే ఆఫీసులోనే పనిచేస్తున్నాడు. కొంచెం చొరవెక్కువ మనిషి. పరిచయం అయిన వారంలోనే సోమలింగాన్ని 'ఏరా!' అనటం మొదలెట్టాడు. సోమలింగం అసలే మొహమాటం మనిషి. మూర్తి ఇతన్ని 'ఏరా' అనటం ప్రారంభించిన కొద్ది రోజులదాకా ఏమండీ అంటూనేవున్నా తరువాత్తరవాత బలవంతాన ప్రాక్టీసు చేసి 'నువ్వు'లోకి దిగాడు.

అతని చేతిలో హెల్మెట్టుంది. నిగనిగా మెరిసిపోతోంది. సోమలింగం ఆశ్చర్యపోయాడు. "స్కూటరెప్పుడు కొన్నావు?" అడిగాడు.

"ఇన్‌స్టాల్‌మెంట్సులో స్కూటర్ కొంటున్నానని చెప్పాను గదరా! నిన్ననే ఫస్టు ఇన్‌స్టాల్‌మెంటు కట్టాను. ముందస్తుగా ఇది ఉంచుకోమని ఇచ్చారు" అన్నాడు విలాసంగా.

'ఏడవలేకపోయావ్' అనుకున్నాడు మనసులో. అంతలోనే ఒక ఆలోచన వచ్చింది సోమలింగానికి. జీతాలు రావడానికి ఇంకా మూడు వారాలుంది. అందాకా మూర్తిగాడిని హెల్మెట్టు అప్పడిగితే?

అడిగేశాడు.

"సారీరా! ఈ హెల్మెట్టు చేతిలో పెట్టుకు తిరగడంతో ఎంత ప్రెస్టేజి పెరిగిందో తెలుసా! ఏ షాపులోకెళ్ళినా, ఎక్కడికెళ్ళినా ఎంత మర్యాద చేస్తున్నారో! అడక్కుండా అప్పులు కూడా పుడుతున్నై. వెధవది స్కూటర్ ఎప్పుడైనా రానీ, రాకపోనీ. ఈ హెల్మెట్టుంటే చాలు" అంటూ ఆప్యాయంగా హెల్మెట్టుని ముద్దుపెట్టుకున్నాడు.

సోమలింగం తనని తాను తిట్టుకున్నాడు. మూర్తి చకచకా కాఫీ తాగి బిల్లు సోమలింగం చేతిలో పెట్టాడు. బిల్లు చెల్లించి బయటికొచ్చాక మూర్తి ఎదురుగా పార్క్ చేసి వున్న స్కూటర్‌ని ఆనుకుని సోమలింగంతో కాస్సేపు బాతాఖానీ కొట్టి, నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

కాస్సేపు అలాగే ఆలోచిస్తూ నిల్చుండిపోయాడు సోమలింగం. ఏవైనా దేవతా హస్తాలు దశరథుడికి బంగారు కలశం ఇచ్చినట్లు రెండు చేతులతో హెల్మెట్టు అందిస్తే ఎంత బావుణ్ను!

ఆ క్షణం... వెనకాల నుంచీ హెల్మెట్టు పట్టుకున్న రెండు మానవహస్తాలు సోమలింగం ముందుకు వచ్చాయి. తన ఊహ మరుక్షణం నిజం అయినందుకు ఒక్క క్షణం కంగారుపడ్డాడు. ఆ చేతుల తాలూకు ఓనర్‌ని చూశాడు. మాసిపోయిన చొక్కా, ప్యాంటు. గడ్డం పెరిగుంది. కళ్ళు నిస్తేజంగా చూస్తున్నాయి.

"విల్ యూ ప్లీజ్ హెల్ప్ మి?" అన్నాడతను. హెల్మెట్టు తిరగతిప్పి వుంది. అందులో చిల్లర నాణాలు ఒకటి, రెండు రూపాయి నోట్లు కూడా వున్నాయి.

ఇంగ్లీషులో అడుక్కునే బెగ్గర్స్ సోమలింగానికి కొత్త కాదుకానీ, ఇలా హెల్మెట్టును భిక్షాపాత్రగా వాడుకుంటున్న అతనిని మెచ్చుకోలుగా చూశాడు. జేబులోంచి పావలా తీసి వేశాడు. అతను థాంక్స్ చెప్పి

వెళ్ళిపోబోతుంటే ఆపాడు.

హెల్మెట్టు కొత్తదిగానే వుంది. ఓ యాభై రూపాయిలిచ్చి దాన్ని సొంతం చేసుకోవాలన్న ఆలోచన సోమలింగానికొచ్చింది. ముందస్తుగా ఓ పది రూపాయిలు ఎడ్వాన్సిచ్చి, మిగతా నలభై ఏ పక్కింటివాళ్ళనో సిగ్గు విడిచి అడిగి ఇచ్చెయ్యొచ్చు. యాభై రూపాయిలకి హెల్మెట్టంటే మాటలా? ఇంగ్లీషులోనే అడిగాడు ''నీవు, లేక మీరు ఈ హెల్మెట్టుని వాకిచ్చేస్తే యాభై రూపాయిలిస్తాను.''

అతను విషాదంగా నవ్వాడు. అతన్ని చూస్తుంటే చదువుకున్న వాడిలానే వున్నాడు. అతనిలా హెల్మెట్టుతో అడుక్కోవడం వెనుక పెద్ద విషాదగాథ వుండి వుంటుంది. ''మీకభ్యంతరం లేకపోతే కాఫీ తాగుతూ మాట్లాడుకుందాం'' అన్నాడతను. ఇద్దరూ మళ్ళీ హోటల్‌లోకి వెళ్ళారు. అతను తన గాథ చెప్పాడు.

కాలేజీ చదువు అయిపోయాక ఎంత కాలానికీ ఉద్యోగం దొరక్క విసిగిపోయి వున్న తరుణంలో అతని క్లాస్‌మేట్ 'ఉద్యోగం చూపిస్తాను రమ్మ'ని పిలిస్తే వచ్చి అతని రూమ్‌లో వుంటున్నాట్ట. అతనికి స్కూటరుంది.

హెల్మెట్టు పెట్టుకుని స్కూటర్ తోలితే కాలు పోయినా, చెయ్యి పోయినా ఏక్సిడెంటులో తలకి మాత్రం దెబ్బ తగలదు కాబట్టి, అలా ప్రాణాలు రక్షించబడతాయి కాబట్టి పౌరులంతా హెల్మెట్టు ధరించాలని పోలీసులు ప్రజల్ని 'ఎడ్యుకేట్' చేసే ప్రయత్నాల్లో గత ఆరు నెలలుగా కృషి చేస్తున్నారు. పేపర్లలో ప్రకటనలు వేయడం, కరపత్రాలు విడుదల చెయ్యటం, రేడియో, టి.వి.లలో ఎనౌన్సుమెంట్లు మొదలైనవి చూసి, సరే ఎప్పటికైనా హెల్మెట్టు కొనాల్సిందేగదా అని కొనుక్కున్నాట్ట అతని రూమ్‌మేటు.

పాపం హెల్లెట్టు కొని నెల తిరక్కుండానే యాక్సిడెంటు అయిందిట. గవర్నమెంటాస్పత్రిలో కాళ్ళూ చేతులతో సహా మొత్తం శరీరం అంతా ఆపరేషన్ చేసి తీసెయ్యాలని డాక్టర్లంతా ఏకగ్రీవంగా నిర్ణయించారట. ఇతనికి కబురు లేటుగా అంది, ఆస్పత్రికొచ్చి చూస్తే అతని మిత్రుడికి కంఠందాకా ఆపరేషన్ చేసి శరీరం అంతా తీసేశారట. ఒక్క తల మాత్రం హెల్మెట్టుండటం వల్ల బతికి బయటపడిందని డాక్టర్లు తృప్తిగా నిట్టూర్చారట. పోలీసులు ఈ వార్తని ప్రముఖంగా వాళ్ళ ప్రాపగాండాలో వాడుకున్నార్ట.

ఈ విషయం చెప్పి అతను కళ్ళనీళ్ళు తుడుచుకున్నాడు. "మీరే చెప్పండి! నాకో మార్గం చూపిస్తానని తీసుకొచ్చిన నా స్నేహితుడ్ని నేనెలా మర్చిపోను? అందుకే అతని హెల్మెట్టుతో అడుక్కుని, నేనింత తిని, అతని తలకింత పెడుతున్నాను'' అన్నాడు.

సోమలింగం మనసు ద్రవించింది. అతని హెల్మెట్టులో ఇంకో రూపాయి పడేసి బిల్లు చెల్లించి బయటికొచ్చాడు.

ఇంటికి రాగానే అలివేలు ఒక విశేషం చెప్పింది. ''మన ప్రక్క వీథిలో కర్ణుడు లేడూ!'' అంది.

''ఊ... ఏమైంది అతనికి?'' అడిగాడు సోమలింగం.

అలివేలు చెప్పిన సమాచారానికి ముందు కర్ణుడి గురించి చెప్పుకోవాలి. అతని పేరు కర్ణారావో, కర్ణయ్యో, కర్ణ శర్మో, కర్ణుడో తెలీదు. కానీ, అతని తలమీద ఎప్పుడూ, ఎల్లవేళలా హెల్మెట్టుంటుంది. 'నిత్య హెల్మెట్టుడు'. కర్ణుడికి సహజ కవచకుండలాల్లాగా ఇతనికి పుట్టుక నుంచే హెల్మెట్టుందంటారు కొంతమంది అతిశయోక్తులు పలికేవారు. సోమలింగమూ అతన్ని నాలుగైదు సార్లు చూశాడు. పడుకునేప్పుడూ, స్నానం చేసేప్పుడూ, డ్యూటీలో వున్నప్పుడూ హెల్మెట్టుతోనే కనపడతాడు. కొంతమంది అతనికి చెవులు లేవని, మరికొంతమంది అతనివి గాడిద చెవులనీ చెవులు కొరుక్కుంటూంటారు. అతను మాత్రం అతని నిత్య హెల్మెట్టు ధారణకి చెప్పే కారణాలు కోకొల్లలు.

అతను పుట్టి చెవులు పనిచేయడం ప్రారంభమైన దగ్గర్నుంచీ ఇంట్లో అతని తల్లిదండ్రుల వాగ్యుద్ధాలు వినీ వినీ చెవులు తూట్లుపడేవిట. బడిలో మేష్టర్ల మొట్టికాయలు, ఉద్యోగంలో చేరాక ఆఫీసరు ముక్కచివాట్లు, ఇవన్నీ భరించినా పెళ్ళి చేసుకున్న తర్వాత మొదటి రాత్రే భార్య సాధింపులు మొదలుపెట్టటం చూసి, తలబొప్పి కట్టడాలు ఇక భరించలేక విరక్తి చెంది అప్పట్నుంచీ నిత్య హెల్మెట్టుడవాలని నిశ్చయించుకున్నాట్ట. ఇంకా కొన్ని లాభాలు కూడా చెప్తాడు. దువ్వెనతో మాటిమాటికీ క్రాపు సరిచేసుకోనక్కర్లేదు. లోపల బట్టతలుందో, నెరిసిన జుట్టుందో ఎవరూ గమనించరు. ఎండా, వానల నుంచి రక్షణ...ఇత్యాదులు.

ఇంతకీ అలివేలు చెప్పిన సమాచారం ఏమిటంటే, సోమలింగం ఇంటికి దగ్గర్లోనే కూనాలమ్మ గుడి అని ఒకటి వుంది. ఆ దేవత చాలా మహత్తు గలదట. పిలిస్తే పలుకుతుందని అంటారు. వారానికోసారి ఈ కర్ణుడు ఒంటరిగా గుడి పక్కనే వున్న చెరువు దగ్గరకెళ్ళి, హెల్మెట్టు తీసేసి కూర్చుని, ప్రకృతిలోని మధుర ధ్వనులు, పక్షుల కిలకిలారావాలు, లేగ దూడల అంబా అరుపులు, గుడిగంటల శబ్దాలు విని మాడుకు గాలి

## తాబేటి తత్వం

గూట్లో గువ్వలా వెచ్చగా
కదలకుండా కూచోవాలని వుంటుంది
ఎగిరే పిట్టలా స్వేచ్ఛగా
బయట తిరగాలనీ వుంటుంది

ఒకేసారి రెండూ ఎలా సాధ్యం?
నేనేం తాబేలుని కాను. అదైతే
నేనెప్పటికీ సాధించలేని పనిని
నిశ్శబ్దంగా చేసి చూపిస్తూ వుంటుంది

స్థాణువులా ఆవేశమూ
ఆకలీ ఏమీ లేకుండా వుండదు;
కుందేలులా పరుగులూ భంగ-
పాటులూ కూడా వుండవు

నిదానమే ప్రధానంగా
నిత్యం పురోగమిస్తూ
నిశ్చయంగా గెలుస్తూ

శూన్యవాదపు నిరాశకీ
సూపర్ ఫాస్ట్ దురాశకీ
మధ్యే మార్గం దానిది

—కె.గోదావరి శర్మ



## మీ పాపాయికి మంచి పేరు ఎంచుకోండి!

# నామకరణమహోత్సవం







ప్రత్యేకంగా యీ శీర్షిక కోసం ఏడాదిలోపు వయసుగల మీ పాప/బాబు ఫోటో- పేరు, వయసు, ఊరు, జన్మించిన తేదీ వివరా లతో మాకు పంపండి!

కొట్టుకుని రిలాక్స్ అయి వెదుతూంటాడుట.

మొన్న ఇలాగే కర్ణుడు చెరువు గట్టున మైమరచి కూర్చున్నప్పుడు చేతిలోని హెల్మెట్టు జారి బుడుంగున నీళ్ళల్లో పడిపోయిందిట. ఇతనికి ఈత రాదు. చుట్టు పక్కల ఎవరూ లేరు. బిగ్గరగా ఏడవటం మొదలెట్టాడు. హెల్మెట్టు పోతే ఇంకోటి కొనుక్కోవచ్చు. కానీ, అది నెత్తిన లేకుండా పెద్ద బజారు వీధి గుండా నడిచి ఇంటికెలా వెళ్ళడం? సిగ్గుతో తల చచ్చిపోయి నట్లుండదూ!

అప్పుడు జరిగిందది. సాక్షాత్తూ కూనాలమ్మ ప్రత్యక్షమయి,"ఎందుకు నాయినా ఏడుస్తున్నావు? ఎన్నొచ్చి?" అని అడిగింది. కర్ణుడు హెల్లెట్టు పోయిన దుఃఖంలో వున్నాడు. ఒచ్చింది కూనాలమ్మో, మరియమ్మో పట్టించుకునే స్థితిలో లేదు.

"ఎన్ హెల్మెట్ కన్నిలో విలింద్ విట్ట్" అని అరవంలో ఏడవసాగాడు. ఆవిడకు జాలేసింది. వెంటనే నీళ్ళల్లో మునిగి ఒక బంగారు హెల్మెట్టు తెచ్చి, "ఇదేనా ఉంగలిదీ?" అంది. కర్ణుడు దాన్ని విసిరి నీళ్ళల్లో కొట్టి "ఇదిల్లై, ఇదిల్లై" అని మళ్ళీ ఏడవటం మొదలెట్టాడు. కూనాలమ్మ "ఎదికి తంబీ అవళ్ గోపం" అని గొణుక్కుంటూ మళ్ళీ మునిగి ఈసారి వెండి హెల్మెట్టు పట్టుకొచ్చింది. కర్ణుడు దాన్ని చిరాగ్గా చూసి అదికాదు పొమ్మని కాళ్ళు నేలకి బాది ఏడుస్తుంటే అప్పుడు అతను పోగొట్టుకున్న ఫైబర్ గ్లాస్ హెల్మెట్టు తెచ్చి "ఇదేనా!" అందిట. "ఆ... అదే అదే" అని ఆనందంగా అందుకుని నెత్తిమీద పెట్టుకుని వెనుదిరక్కుండా ఇంటికి పరుగెత్తాట్ట వెనుక నుంచీ కూనాలమ్మ "తంబీ... ఇంద... ఈ రెండు హెల్మెట్లూ కూడా నీవే ఎడుత్తుకుపో" అని అరుస్తున్నా వినిపించుకోలా.

ఈ కథ ఎక్కడో, ఎప్పుడో విన్నట్లనిపించింది. సోమలింగానికి. ఈ అరవ దేశంలో వీధికో దేవత వుంటుం ది, ఎప్పుడో ఎవరో చెప్పి వుంటార్లే అను కున్నాడు. ఆ క్షణంలోనే అతనొక నిర్ణయం తీసు కున్నాడు.

ఆ నిర్ణయం అతని జీ(వి)తాన్ని నష్టపరుస్తుందని ఆ క్షణంలో తెలియదతనికి.

కూనాలమ్మ దగ్గర ఎన్ని జతల బంగారు, వెండి హెల్మెట్లు వున్నాయో తెలీదుగానీ, ఆ మూర్ఖుడు తీసుకోకుండా వదిలేసిన హెల్మెట్లు ఇంకా ఆవిడ దగ్గరే వున్నాయి.

వెంటనే ప్రక్కింటి వాడిదగ్గర "ఓసారి మీ హెల్మెట్టు అప్పిస్తారా!" అని అడిగి తీసుకుని హుటాహుటిన కూనాలమ్మ చెరువు దగ్గరకు చేరాడు.

కాస్సేపు లలలా... లలలా అని కూనిరాగం తీసి, అటూ ఇటూ చూసి హెల్మెట్టుని విసిరిపుచ్చుకుని నీళ్ళల్లో గిరాటేసి ఏడవడం మొదలెట్టాడు. కాస్సేపు గడిచింది.

'ఇంకా రాదేంటి కూనాలమ్మ... కొంపదీసి రాక పోతే?' ఇలా అనుకోగానే నిజంగా దుఃఖం వచ్చింది. ఏడుస్తున్నాడు బిగ్గరగా.

"ఎదిక్ నీ అళ్ గది; (ఎందుకేడుస్తున్నావ్?)"అని వినిపిస్తే తలెత్తి చూశాడు. ఎవరో అరవమామీ నిల్చు నుంది.

"నీ కోసం కాదులేవమ్మా! కూనాలమ్మ రాలేదా?" అని అటూ ఇటూ చూశాడు.

ఆవిడ చిరునవ్వు నవ్వి "నా పేరే కూనాలమ్మ. చెప్పు నీకష్టం ఏమిటి?" అంది.

ముందర సోమలింగం నిశ్చేష్టుడయినా ఈ పాపిష్టి కళ్ళకు మానవరూపంలో కాక ఇంకెలా కనిపిస్తుందిలే అనుకుని-

"నా హెల్మెట్టు పోయింది" అన్నాడు ఏడుస్తూ.

"ఓ.. తెలుంగుకారా!" అని కాస్త దూరంలో వున్న చెట్టు వైపు చూసి నవ్వింది. సోమలింగం కూడా అటు వైపు చూశాడు. ఏమీ కనిపించలా. ఈ దేవతలకు మనుష్యుల మొహంలోకి చూస్తూ మాట్లాడటం అవమానం కామోసు అనుకున్నాడు.

కూనాలమ్మ "ఇరు... నానిప్పు వర" అని చేతులు రెండూ సాచి ఎక్స్‌పర్ట్ డైవర్‌లాగా చెరువులో బుడుంగున మునిగింది. సోమలింగం ఆత్రుతగా చూస్తున్నాడు. కాస్సేపు వెతికి ('వెతికినట్లు నటించి' అనుకున్నాడు సోమలింగం) హెల్మెట్టు పట్టుకొచ్చింది. "ఇదేనా నీది?" అడిగింది చీరకొంగు పిండుతూ.

సోమలింగం కళ్ళు నులుముకుని చూశాడు. అది బంగారందీ కాదు. వెండిదీ కాదు. తనదే, అంటే ప్రక్కింటి వాడి దగ్గర తీసుకున్న అప్పు హెల్లెట్టు. ఇది నాది కాదంటే ఈసారి తప్పకుండా బంగారంది తెస్తుందని "ఇది నాది కాదు" అని ఏడవడం మొదలెట్టాడు.

ఆవిడ జుట్టులోంచీ నీళ్ళు దులుపుతోందల్లా వెంటనే ముడేసి, "హమ్మయ్య! నీ దంటావేమోనని భయపడి చచ్చానుకో" అని "ఎన్నంగో... బద్మాషా..." అని కేకేసింది. 'కుయ్యి'మని ఈలకూడా వేసినట్లు జ్ఞాపకం. వెంటనే చెట్టుచాటు నుంచి వాళ్ళాయన కామోసు బక్కపల్చగా వున్నాడు- స్కూటర్ మీద యమస్పీడుగా రావడం, ఈవిడ ఆయన నెత్తిమీద హెల్మెట్టు అమర్చడం, చెంగున ఎగిరి స్కూటర్ వెన కాల ఎక్కడం... ఝుొమ్మంటూ దూసుకుపోవడం.. తృటిలో జరిగాయి. సోమలింగం తెల్లమొహం వేసి చూస్తూండిపోయాడు. కాస్సేపటికి గానీ అర్థం కాలా. తాను హెల్మెట్టు కావాలని నీళ్ళల్లో పడెయ్యటం చెట్టు చాటు నుంచి చూశారన్నమాట. కనీసం స్కూటర్ నెంబర్ కూడా నోట్ చేసుకోలా...

ఈసారి నిజంగానే బావురమని ఏడుస్తూ కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి తిరిగొచ్చాడు.

వరండాలో కూర్చున్న తండ్రిని చూసి పెరటి ద్వారం గుండా లోపలికి వెళ్ళి బామ్మని కావలించుకుని జరిగింది చెప్పాడు. ఆవిడ సోమలింగాన్ని నాలుగు చీవాట్లేసి "కట్టెలు కొట్టేవాడూ- గొడ్డలీ కథ ఎన్నిసార్లు చెప్పించుకు వచ్చావు చిన్నప్పుడూ!"అనగానే సోమలింగానికి తానెట్లా మోసపోయాడో తెలిసి దుఃఖం రెట్టింపయింది. బామ్మ సోమలింగాన్ని ఊరడించి కొడుకు తెచ్చిన డబ్బులోంచి ఐదొందలిచ్చి వెంటనే రెండు హెల్మెట్లు కొని తెచ్చి పక్కింటివాడికి ఒకటిచ్చేయమని చెప్పింది. ఈ విషయం తండ్రికి చెప్పొద్దని ఒట్టేయించుకుని బామ్మిచ్చిన డబ్బు జేబులో వేసుకుని మళ్ళీ పెరటిద్వారం గుండా బయటపడ్డాడు- సోమలింగం.

●